క్లుప్తంగా

వర్షాలతో జాగ్రత్త

మహమ్మదాబాద్: వర్షాలకు ప్రజలు తగిన జాగ్రత్తలు వహిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. ఉమ్మడి మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు ప్రమాదకరంగా ఉన్న ఇళ్లల్లో ప్రత్యామ్నయంగా ఇతర ఇళ్లల్లో ఉండాలన్నారు. నివాసాలు ప్రమాదకరంగా ఉంటే ఎక్కడ ఉండాలో తోచని పరిస్థితి వచ్చినా పోలీసులకు, తహసీల్దార్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. పొలాలకు వెళ్లే రైతులు ప్రమాదకర కాల్వలు దాటే సమయంలో చూసుకుని వెళ్లాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

దేవరకద్ర: వర్షాల వల్ల నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం ప్రకటనలో కోరారు. అవసరం అయితే తప్ప బయటకు రావద్దని, శిథిలావస్థ ఇళ్లలో ఉండే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. డ్రెయినేజీ కాల్వలు, వాగులు, చెరువుల వద్దకు ప్రజలు వెళ్లరాదని, ఎక్కడైన ఇనుప విద్యుత్ స్తంభాలు ఉంటే వాటిని తాకరాదని, విద్యుత్ పరికరాలతో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మిడ్జిల్: ఎడతెరిపి లేని వర్షాలకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి సూచించారు. ప్రజలు పాడుబడిన, శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉండకూడదన్నారు. విద్యుత్ స్తంభాలకు, వైర్లకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు.

నవాబుపేట: వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి సూచించారు. పాత ఇళ్లు కూలే ప్రమాదం ఉందని ఇప్పటికే గ్రామాలకు సమాచారం ఇచ్చామని తెలిపారు. పాత ఇళ్లలో ఉన్నవారు రాత్రి వేళలలో నిద్రపోకుండా వేరేచోటా ఆశ్రయం పొందాలని సూచించారు.

మైనార్టీల అభ్యున్నతికి సహకారం



మహమ్మదాబాద్: మైనార్టీల అభ్యున్నతికి అన్ని రకాల సహకారం అందిస్తామని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని పీర్ల చావిడికి రూ.25వేల ఆర్థిక సాయం అందించారు. అన్ని గ్రామాల్లో కలిసి పండుగలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్వతమ్మ, సాబేర్, మగ్బూల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి రైతులే బుద్ధి చెప్పాలి

దేవరకద్ర రూరల్: బీఆర్‌ఎస్‌తోనే రైతుల అభ్యున్నతి సాధ్యమని ఎంపీపీ రమాదేవి అన్నారు. గురువారం లక్ష్మీపల్లి రైతువేదికలో కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా క్లస్టర్ రైతులతో సమావేశం నిర్వహించారు. దశాబ్దాల సమైఖ్య పాలనలో కరువుతో అల్లాడిన పాలమూరు, తెలంగాణ ఏర్పాటు తర్వాత పచ్చబడిందన్నారు. వ్యవసాయానికి 3 గంటల కరెంట్ చాలన్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అన్నపూర్ణ, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కొండారెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతువేదికలో చర్చ

గండేడ్: రైతులతో చర్చ కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యానాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మధ్యాహ్నం 2గంటలకు కార్యక్రమం ఉంటుదన్నారు. కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 3గంటలు కరెంటు ఇచ్చి రైతులను నట్టేట్ట ముంచుతుందని, అదే బీఆర్‌ఎస్ మూడు పంటల విధానాన్ని అమలు చేస్తున్నదని తెలిపారు. ఆయా గ్రామాల రైతులు, రైతుబంధు కన్వీనర్‌లు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

క్షమాపణ చెప్పాల్సిందే..

జడ్చర్ల టౌన్: కలెక్టర్‌ను అసభ్యకరంగా మాట్లాడిన కాంగ్రెస్ నాయకుడు అనిరుధ్‌రెడ్డి క్షమాపణలు చెప్పాల్సిందేనని కౌన్సిలర్ చైతన్య చౌహాన్, మాజీ ఎంపీటీసీ రవినాయక్, గిరిజన విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేషన్‌నాయక్ డిమాండ్ చేశారు. గురువారం అనిరుధ్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గిరిజన కలెక్టర్‌పై అనుచిత వాఖ్యలు చేసినందున గిరిజన జాతి క్షమించదని వారు పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో శంకర్, రాములు, రాజు, గోవింద్, సేవ్యానాయక్ ఉన్నారు.

ప్రారంభమైన మొహర్రం ఉత్సవాలు

బాలానగర్: మండల కేంద్రంతోపాటు మోతీఘణాపూర్, ఉడిత్యాల, నేరళ్లపల్లి, పెదరేవల్లి, మొదంపల్లి, పెద్దాయపల్లిలో మొహర్రం ఉత్సవాలు గురువారం ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా మత పెద్దలు, నిర్వాహకులు మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



స్తంభించిన జనజీవనం

జడ్చర్ల టౌన్: ఎడతెరిపిలేని వర్షాలతో జనజీవనం స్తంభించింది. మూడురోజులుగా కురుస్తున్న వర్షానికి మున్సిపాలిటీ పరిధిలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా 167వ నంబర్ జాతీయరహదారిపై సిగ్నల్‌గడ్డ వద్ద హైస్కూల్ సమీపంలో రోడ్డు గుంతలు పడి వర్షపునీరు నిలిచి వాహనదారులకు అసౌకర్యంగా మారింది. రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం కాకపోవటంతో రోడ్డు అధ్వానంగా తయారైంది.

లోతట్టు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటన..

మున్సిపాలిటీ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో కమిషనర్ మహమూద్‌షేక్ గురువారం పర్యటించారు. 4వ వార్డులో కౌన్సిలర్ దేవాతో కలసి శిథిలావస్థలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఇంటి యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అవసరమైతే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. 17, 18 వార్డుల్లో కొన్ని ఇళ్లల్లోకి నీళ్లు వచ్చినట్లు స్థానికులు తెలిపారు. వానలు పడుతుండటంతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాలు సందర్శించి ఇబ్బందులు లేకుండా చూడాలని కౌన్సిలర్లకు ఆయన సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

చెరువులు, కుంటల్లోకి చేరుతున్న నీరు..

మహమ్మదాబాద్: వర్షాలకు చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుంది. గురువారం ఎడతెరిపిలేకుండా వర్షం కురువడంతో వాగులు పారాయి. మండలంలోని గాధిర్యాల్ ఊరచెరువు, మొకర్లాబాద్ లింగమయ్య చెరువు, నంచర్ల, చౌదర్‌పల్లి, మహమ్మదాబాద్, వెంకట్‌రెడ్డిపల్లి చెరువులోకి నీరు చేరింది. దీంతో రైతులు ఓ వైపు ఆనందం వ్యక్తం చేస్తున్నా మరోవైపు మాత్రం ఎడతెరిపిలేని వానలతో అవస్థలు పడుతున్నారు.



జిల్లా కేంద్రంలో న్యూటౌన్ వద్ద కురుస్తున్న వర్షం

శిథిలావస్థకు చేరిన ఇళ్ల పరిశీలన..

భారీ వర్షాలకు ఆయా గ్రామల్లో ప్రజలు నివాసం ఉంటున్న ఇళ్లు ప్రమాదకర పరిస్థితుల్లో ఉండటంతో మండల రెవెన్యూ అధికారులు వెళ్లి పరిశీలించారు. గురువారం వర్షాలు ఎక్కువ కావడంతో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్‌ఐ యాదయ్య చిన్నాయపల్లి, దేశాయిపల్లికి వెళ్లి శిథిలావస్థలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ప్రమాదకరంగా ఉంటే ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల భవనాల్లో ఉండేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. అలాంటి వారు ఎవరైనా ఉన్నా ఎప్పటికప్పుడు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

నీట మునిగిన పంట పొలాలు..

గండేడ్: మండలంలోని గ్రామల్లో ఉదయం నుంచి చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. దీంతో పత్తి, మొక్కజొన్న పంటలు నీట మునిగాయి. వానకు పొలాల్లో నీరు చేరడంతో రెండు మూడు రోజుల కిందట చల్లిన తూకం కొట్టుకుపోయినట్లు పలు గ్రామాల రైతులు తెలిపారు. వాగులు పారుతుండడంతో చెరువుల్లోకి నీరు చేరుతుంది. సాలార్‌నగర్ ప్రాజెక్టుకు వెళ్లే వాగు చెక్‌డ్యాం నిండి వరద ప్రాజెక్టులోకి వెళ్తుంది. రెడ్డిపల్లి మల్లయ్య చెరువు, వెన్నాచేడ్ పెద్ద చెరువు, కప్లాపూర్ చెరువు తదితర గ్రామాల్లోని చెరువుల్లోకి కొద్ది కొద్దిగా నీరు చేరుతుంది. వర్షాల కారణంగా గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కూలే దశలో ఉన్న ఇళ్లల్లో ఉండరాదని తహసీల్దార్ జ్యోతి సూచించారు.



చిన్నాయపల్లిలో ఇళ్లను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు



గాధిర్యాల్ ఊరచెరువులో చేరిన వర్షపునీరు



జిల్లా కేంద్రంలో..



జడ్చర్లలో శిథిలావస్థలో ఉన్న ఇంటిని పరిశీలిస్తున్న కమిషనర్

విపత్తు నివారణ బృందాల ఏర్పాటు



జిల్లాకేంద్రంలో వర్షపు నీటిని తొలగిస్తున్న మున్సిపల్ కార్మికులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విపత్తు నిర్వహణ నివారణ బృందాలను ఏర్పాటుచేశారు. మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో 24 గంటల పాటు పనిచేసేందుకు మూడు బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలతోపాటు సహాయకులుగా మున్సిపల్ జవాన్లు, పారిశుద్ధ్య సిబ్బంది, కార్మికులు ఉంటారు. ఎక్కడైనా ఎలాంటి విపత్తు జరిగినా ఈ బృందం ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపడుతుంది. వీటితోపాటు మున్సిపల్ కార్యాలయం, కొత్త కలెక్టరేట్ లోనూ కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. పట్టణ ప్రజలు అత్యవసరమైనప్పుడు 70939 11352 లేదా 08542- 241165, 252303లను సంప్రదించవచ్చని మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

జడ్చర్ల మున్సిపాలిటీలో..

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో రెండు రెస్క్యూ టీంలు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ మహమూద్ షేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో టీంలో ఆరుగురు సభ్యులను నియమించామని, ఈ టీంలు 24 గంటలు పనిచేస్తాయని, ఏ ఆపద వచ్చినా సమాచారం అందిస్తే వెంటనే అక్కడికి వచ్చి సేవలు అందిస్తారని చెప్పారు.

గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట



గిరిజనులకు పోడు పట్టాలు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ న్యూటౌన్ (హన్వాడ): గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం హన్వాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద రూ.10 లక్షలతో నిర్మించిన సమావేశ మందిరాన్ని ప్రారంభించారు. అలాగే 19 మంది గిరిజన రైతులకు 13.02 ఎకరాల పోడు పట్టాలు, ఏనెమీదితండాకు చెందిన 8 మంది గిరిజనులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ పోడు పట్టాలతో గిరిజన రైతులకు భూమిపై హక్కు కల్పించామన్నారు. పోడు భూముల్లో ఎస్టీ కార్పొరేషన్ ద్వారా భూమి అభివృద్ధితోపాటు బోర్లు వేయించి విద్యుత్ కనెక్షన్ వంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. బీఆర్‌ఎస్ రైతు ప్రభుత్వం అని, ఇతరులు చెప్పే మాటలకు మోసపోవద్దని సూచించారు. జిల్లాలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ రవినాయక్, ఎంపీపీ బాలరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఛత్రునాయక్, డీఎఫ్‌ఓ సత్యనారాయణ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మధుసూదన్‌గౌడ్, జిల్లా బీసీ సంక్షేమాధికారి ఇందిర, తహసీల్దార్ శ్రీనివాసులు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులను శంకుస్థాపన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ఎనుగొండ నుంచి మౌలాలిగుట్ట సమీపంలోని బీహెచ్‌కేకాలనీ వరకు రూ.1.98 కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు పనులకు గురువారం రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, డీసీసీబీ ఇన్‌చార్జ్ చైర్మన్ కె.వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కౌన్సిలర్లు రామాంజనేయులు, వనజ, పటేల్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినూత్న పద్ధతిలో కార్మికుల నిరసన



నవాబుపేటలో దండం పెడుతూ నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

నవాబుపేట: తమ బాధలు అర్థం చేసుకుని సమ్యలు పరిష్కరించండి అంటూ పంచాయతీ కార్మికులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నిరసన దీక్ష శిబిరంలో వంగి దండం పెడతూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, శ్రీనివాస్, వెంకటయ్య, రమేష్, నర్సింహులు, శ్రీను, రఘు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా నిరసన కార్యక్రమం చేపట్టారు. గురువారం వర్షం వల్ల కింద కూర్చోడానికి వీలుకాక పోవడంతో నిలబడి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షంలో అలాగే ఆందోళన చేశారు. తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాంబశివుడు, వెంకట్‌రాములు, బాలు, వెంకటేష్, బుగ్గన్న, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు సన్మానం



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా జిల్లాలో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై మెదక్ జిల్లాకు వెళ్లిన పద్మశ్రీని అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. జిల్లాకు ఆమె చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. కార్యక్రమంలో రవికుమార్‌యాదవ్, బైకనిబాలుయాదవ్, అంజన్న, భరత్, నాయకులు పాల్గొన్నారు.

సీఐగా రామకృష్ణ బాధ్యతలు

భూత్పూర్: భూత్పర్ సీఐగా రామకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. వెల్దండలో సీఐగా విధులు నిర్వహించిన ఈయన బదిలీపై వచ్చారు. ప్రస్తుతం సీఐగా విధులు నిర్వహించిన రజితారెడ్డి హైదరబాద్ ఐజీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

గండేడ్: మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా టీక్యానాయక్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి గురువారం నియామకపత్రం అందజేశారు. పార్టీ ఇచ్చిన అవకాశంతో మరింత చిత్తశుద్ధితో పనిచేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా, రాష్ట్ర అధ్యక్షులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్లకు మరమ్మతు చేపట్టండి

చిన్నచింతకుంట: మండలంలోని ఉంధ్యాలలో బురదమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని బీజేపీ దళిత మోర్చా మండల ప్రధాన కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. కురుస్తున్న వర్షాలకు గ్రామంలోని రోడ్డు బురదగా మారడంతో గురువారం భాస్కరెడ్డి, బాల్‌చంద్రిలతో కలిసి పరిశీలించారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో గుంతలు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు సీసీ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు.

మణిపూర్ ఘటన దుర్మార్గం

స్టేషన్ మహబూబ్‌నగర్: మణిపూర్ రాష్ట్రంలో స్త్రీలపై చోటు చేసుకున్న ఘటన సభ్య సమాజం సిగ్గుపడేలా చేసిందని కల్వరి ఎంబీసీ ప్రతినిధులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంబీ చర్చిలో గురువారం సమావేశంలో మాట్లాడారు. స్త్రీలను గౌరవప్రదంగా చూసుకునే దేశంలో ఇలాంటి సంఘటన చోటుచేసుకోవడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. దోషులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా శిక్షించాలన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత కల్పించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సమావేశంలో చైర్మన్ పాస్టర్ ఎస్.వరప్రసాద్, వైస్ చైర్మన్ బీఐ జేకబ్, కార్యదర్శి జేఐ.డేవిడ్, కోశాధికారి టీఏ.స్టివెన్, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా ఓటర్ జాబితా



మాట్లాడుతున్న తహసీల్దార్ పార్థసారధి

జెడ్పీసెంటర్ (మహబూనగర్): తప్పులు లేకుండా ఓటర్ జాబితాను సిద్ధం చేయాలని అర్బన్ తహసీల్దార్ పార్థసారధి సూచించారు. గురువారం స్థానిక జెడ్పీ హాల్‌లో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు ఓటర్‌జాబితాపై శిక్షణ నిర్వహించారు. 18 ఏళ్లు దాటిన వారితో కొత్తగా ఓటరుగా నమోదుకు చేయాలని, దరఖాస్తు చేసుకున్న వారితో ఫారం-6తో వివరాలు నమోదు చేయాలన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితా తదితదిర అంశాలలో చురుకైన పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నర్సింగ్, వీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలాల్లో బోర్డుల ఏర్పాటు



బోర్డు పాతుతున్న సిబ్బంది

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో పది శాతం భూముల పరిరక్షణ కోసం గురువారం బోర్డులు ఏర్పాటు చేశారు. స్థలం ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని బోర్డులో రాసి పెట్టారు. ఈ నెల 10న కౌన్సిలర్ కుమ్మరి రాజు కలెక్టర్‌కు 10శాతం భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నాయని వాటిని పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. 20వ తేదీలోగా చర్యలు తీసుకోకుంటే నిరాహారదీక్ష చేపడతానని విన్నవించారు. స్పందించిన కలెక్టర్ కమిషనర్ మహమూద్‌షేక్‌కు సూచనలు జారీ చేయటంతో చర్యలు చేపట్టారు.

ఎస్‌బీఐ సేవలు వినియోగించుకోవాలి

రాజాపూర్: ఎస్‌బీఐ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఏజీఎం అనిల్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని తిర్మలాపూర్ చెందిన శంకరయ్య ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందితే ఆయన మండల ఎస్‌బీఐలో ఖాతాదారుడు కావడంతో జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన రూ.20 లక్షలను భార్య చెన్నమ్మకు అందజేశారు. కార్యక్రమంలో గోపాల్, వదువని, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది

పొలాల్లో నీరు నిల్వ ఉండొద్దు



రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

రాజాపూర్: పంట పొలాల్లో వర్షపునీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ నరేందర్ సూచించారు. గురువారం మండలంలోని కల్లేపల్లి, రంగారెడ్డిగూడలో రైతులు సాగుచేసుకున్న పత్తి, మొక్కజొన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి జాగ్రతలను వివరించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా పొలాల్లో కాల్వలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షం తగ్గిన తర్వాత యూరియా లేదంటే 19.19.19 పంటలపై పిచికారి చేసుకోవాలన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

దేవరకద్ర: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేపట్టిన డబుల్ బెడ్రూంల పోరుబాటలో పాల్గొనకుండా మండల నాయకులను పోలీసులు ముందస్తుగా గురువారం ఉదయం అరెస్ట్ చేశారు. నాయకులు మాట్లాడుతూ.. మండలంలో ఒక్కటంటే ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు నిర్మించలేదని ఇక ఎక్కడికి వెళతామని వారు విమర్శించారు. పోలీసులు తమను అరెస్ట్ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అరెస్టయిన వారిలో మండల అధ్యక్షుడు అంజన్‌రెడ్డి, చంద్రశేఖర్, గోవిందు, చెన్నప్ప, దేవన్న, కొండారడ్డి, రజినీకాంత్, ఆశన్న ఉన్నారు.

మిడ్జిల్: బీజేపీ కార్యకర్తలు, నాయకులను గురువారం ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ ఆధ్వర్యంలో అరెస్ట్ చేసి స్టేషన్‌లో ఉంచారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్ మాట్లాడుతూ అరెస్టులతో ప్రభుత్వం ప్రజాసమస్యలపై పోరు యాత్రను ఆపలేదన్నారు. అరెస్టయిన వారిలో నరేందర్, తిరుపతి ఉన్నారు.

నవాబుపేట: మండల కేంద్రం నుంచి హైదరాబాద్ తరలుతున్న బీజేపీ నాయకులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. అధికార పార్టీ అణచివేత ధోరణి అవలంభిస్తుందని, ఈ పాలన మరో కొద్దిరోజుల్లోనే పతనం కానుందని నాయకులు అన్నారు. అరెస్టయిన వారిలో రాజు, సత్యం, నర్సింహ, శ్రీను, మల్లేష్, రమేష్, ,చంద్రయ్య ఉన్నారు.

అవినీతి లేకపోతే భయం ఎందుకు?..

పాలమూరు: డబుల్ బెడ్‌రూం ఇళ్ల వ్యవహారంలో అవినీతి లేకపోతే సీఎం కేసీఆర్ ఎందుకు భయపడుతున్నారని, ఇళ్ల సందర్శనకు వెళ్తున్న బీజేపీ నాయకులను గృహనిర్బంధం చేయడం ఏమిటని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మాచారి ప్రశ్నించారు. గురువారం తెలంగాణ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. డబుల్ బెడ్రూం ఇళ్లు సందర్శించి నిజమైన లబ్ధిదారులు ఉన్నారా లేదా ఉంటే ఎలాంటి అవస్థలు పడుతున్నారు అనే విషయాలు తెలుసుకోవడానికి వెళ్లడానికి ఎందుకు అడ్డుకున్నారన్నారు. డబుల్ బెడ్‌రూం వ్యవహారంలో భారీగా అవినీతి జరిగిందన్నారు. ఈనెల 24న జిల్లా స్థాయిలో ఇళ్ల అవకతవకలపై భారీగా ధర్నా చేస్తామన్నారు. పోలీసులను అడ్డు పెట్టుకుని ఇలాంటి చర్యలకు పాల్పడటం సరికాదన్నారు.



మిడ్జిల్‌లో పోలీస్‌స్టేషన్ వద్ద బీజేపీ నాయకులు

గ్రామాలన్నీ చెత్తమయం

నవాబుపేట: అసలే వర్షాలు ఆపై పంచాయతీ కార్మికుల సమ్మెతో గ్రామాలన్నీ చెత్తమయంగా మారాయి. బురదతో పాటు ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉండడంతో గ్రామాలు మురికి కూపాలుగా తయారయ్యాయి. ప్రధానంగా మేజర్ పంచాయతీలు నవాబుపేట, ఇప్పటూర్, కొల్లూర్, చౌడూర్, మరికల్, పోమాల్‌లో చెత్త సమస్య తీవ్రంగా మారింది. వర్షంతో చెత్త తీయటం సాధ్యం కాకపోవటంతో పేరుకుపోయింది.



రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

పారిశుద్ధ్యంపై స్పందించండి

బాలానగర్: గ్రామ కార్మికులు వారి సమస్యలపై సమ్మెకు దిగిన సందర్భంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం కుంటుపడిందని గురువారం బాలానగర్ సర్పంచ్ విజయలక్ష్మి తెలిపారు. 20 రోజులపైగా గ్రామ కార్మికులు సమ్మెకు దిగడంతో మండల కేంద్రంలో ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోయిందన్నారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించడమా, లేకుంటే ప్రత్యమ్నయా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.